సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 25 । మే । 2023



ప్రభుత్వ విధానాల అమలుకు చర్యలు

ప్రభుత్వ విధానాలు అమలు జరిగేలా చూస్తామని కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష అన్నారు. -8లో..



నేటి నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ కోసం గురువారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. -8లో..



వినియోగదారులు సంతృప్తి చెందేలా విద్యుత్ సేవలు

వినియోగదారులు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్ రమణ అన్నారు. -8లో..

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ'

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల 25వ తేదీ 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటలలోపు 08562–242457 నంబర్‌కు ఫోన్ చేసి, తమ సమస్యలను తెలిపి పరిష్కారాలు పొందవచ్చని తెలిపారు.

25న హజ్ యాత్రికులకు టీకాలు

కడప రూరల్: ప్రభుత్వం నుంచి హజ్ యాత్రకు వెళుతున్న వారికి ఈ నెల 25వ తేదీన టీకాలు వేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఈ నెల 25వ తేదీన కడపలోని మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9 గంటలకు టీకాలు వేస్తామన్నారు. అదేవిధంగా హెల్త్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ప్రైవేట్ హజ్ యాత్రికులు కూడా టీకా, హెల్త్ కార్డు కోసం తమ పేరును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా సుదర్శన్‌రెడ్డి



కడప అర్బన్: రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా జల్లా సుదర్శన్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన విజయవాడలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కాగా ఈయన స్వగ్రామం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని గాలివీడు మండలం. గత 25 సంవత్సరాల నుంచి కడపలోని జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. మంచి గుర్తింపు వుంది. రాష్ట్ర హైకోర్టు ఆమోదంతో ఈయనను డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని అన్ని కోర్టులలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్స్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్స్..వారి సిబ్బంది ఈయన పరిధిలోకి వస్తారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్ఐవో రమణరాజు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు నిర్ణీత సమయానికే పరీక్షాకేంద్రాలకు చేరుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 62 పరీక్షా కేంద్రాల్లో ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ ఏడాది విద్యార్థులకు పరీక్షలు జరి గాయి. ఇందులో తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ ఒకేషనల్‌కు సంబంధించి 6180 మందికి గాను 5713 మంది పరీక్షలు రాశారు. దీంతో 91.4 శాతం హాజరు నమోదైంది. ఇంటర్ ఆర్ఐవో రమణ రాజు కడపలోని జీఎంజే జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

దీవెనతో భవిత దేదీప్యం



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ గణేష్‌కుమార్ తదితరులు

- జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్
- జగనన్న విద్యాదీవెన రెండో విడత నిధులు విడుదల
- జిల్లాలో 38,808 మంది విద్యార్థులకు లబ్ధి
- రూ. 35.54 కోట్ల జమ

కడప సెవెన్‌రోడ్స్ : విద్యా దీవెన పథకం ద్వారా..పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం..వారి తల్లిదండ్రుల కలలను కూడా సాకారం చేస్తోందని.. జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా.. 2022– 23 విద్యా సంవత్సరానికి సంబంధించి.. రెండో విడత 'జగనన్న విద్యా దీవెన'లబ్ధి మొత్తాన్ని బటన్ నొక్కి.. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. కడప కలెక్టరేట్ వీసీ హాలులో జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన' అనే పథకం.. రాష్ట్రంలో ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, ఆపై స్థాయి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ముఖ్యమంత్రి అందిస్తున్న సువర్ణావకాశం అన్నారు. ప్రభుత్వం సాయం అందుకుని.. బాగా చదువుకోవాలన్నారు.

నియోజకవర్గం	విద్యార్థులు	మొత్తం (రూ.లలో)
కడప	6023	5,51,12,981
బద్వేలు	5086	4,59,34,861
జమ్మలమడుగు	6093	5,41,87.401
కమలాపురం	4486	4,12,71,382
మైదుకూరు	5194	4,71,99,676
ప్రొద్దుటూరు	5710	5,11,33,067
పులివెందుల	4976	4,90,76,656
రాజంపేట	1240	1,15,73,136
(సిద్దవటం+ఒంటిమిట్ట మండలాలు)		
మొత్తం	38,808	35,54,89,160

- ముఖ్యమంత్రి వీసీ ముగిసిన అనంతరం జిల్లాలోని 38,808 మంది విద్యార్థులకు మంజూరైన 'జగనన్న విద్యా దీవెన'లబ్ధి మొత్తం రూ. 35,54,89,160ల మెగా చెక్కును.. విద్యార్థులు, వారి తల్లులకు జేసీ, ఇతర అధికారులు అందజేశారు.
- కార్యక్రమంలో ఏపీఈఐడీ డైరెక్టర్ బి.నాగమల్లిక, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు హెచ్.వెంకటసుబ్బయ్య, డాక్టర్ వి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రొద్దుటూరులో గోల్డ్ స్మిత్ పనిచేస్తూ మా నాన్న మమ్మల్ని చదివిస్తున్నాడు. మాలాంటి వారికి జగన్ సార్ అందిస్తున్న విద్యా సంక్షేమ పథకాలు ఎంతో ఉపకరిస్తున్నాయి. ట్యూషన్, హాస్టల్ ఫీజులను ప్రభుత్వమే ఇస్తోంది. గతంలో ఏ సీఎం ఇలాంటి పథకాలు అమలు చేయలేదు.ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – కె.శ్రీగాయత్రి, బీఎస్సీ అనస్థిషియా, రిమ్స్, కడప

విద్యాదీవెన వరం



రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యా దీవెన వరంగా భావిస్తున్నా. వీఎన్ పల్లెకు చెందిన రైతు కుటుంబంలో పుట్టిన నేను కాలేజీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాను. విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా ఫీజు రీఎంబర్స్‌మెంట్ మొత్తాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. – పి.దేదీవ్య, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, కడప

ఎంతో ఉపయోగకరం



ఫీజుల కోసం తల్లిదండ్రులు పడే కష్టాలు చూసి చదువు మానేసి ఉపాధి పనులు చేసుకునే యువతను చాలామందిని చూశాను. విద్యా దీవెన పథకం మాలాంటి పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.చాలామంది ముఖ్యమంత్రులు వచ్చారు...వెళ్లారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు సాయం అందిస్తున్న ఇలాంటి సీఎం ఎవరూ లేరు. అందుకే పేద విద్యార్థుల పాలిట దేవుడు సీఎం వైఎస్ జగన్. – వై.హర్షవర్ధన్‌రెడ్డి, బీఎస్సీ, ఎస్వీడీసీ, కడప

సీఎం విద్యా ప్రదాత



మాది నంద్యాల. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా ప్రదాతగా రాష్ట్ర చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో జగనన్న విద్యా దీవెన అనే బృహత్తర కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. – జి.జయతి కీర్తి, బీఎస్సీ అనస్థిషియా, రిమ్స్, కడప

భూ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు



పులపత్తూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

రాజంపేట: అన్నమయ్య డ్యాం వరద పీడితుల భూ సమస్యల పరిష్కారందిశగా రెవెన్యూ అధికారులు అడుగులు వేశారు. బుధవారం పులపత్తూరు గ్రామంలో ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇటీవల అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పులపత్తూరు గ్రామాన్ని సందర్శించిన క్రమంలో రెవెన్యూపరంగా నెలకొన్న సమస్యలను బాధితులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా వరదల వల్ల ఇంటిలోని భూమి ఆధారిత పుస్తకాలు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భూ సంబంధిత సమస్యలు తలెత్తాయి. ఇప్పటికే ఇలాంటివాటిని పరిష్కరించారు. మిగిలిపోయిన వాటిని కూడా పరిష్కరించాలని ఆదేశించారు. సదస్సులో అన్నమయ్య జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ రెవిన్యూ పరంగా బాధితులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామసర్పంచి భీము శ్రీదేవమ్మ, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి భీము జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తలెత్తిన సమస్యలను ఒకొక్కటిగానే పరిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదకన అభివృద్ధికి సంబంధించి అన్ని కార్యక్రమాలను చేపతుతోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో భాస్కర్, తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డి, హౌసింగ్ డీఈ మురళీ, పులపత్తూరు గ్రామస్తులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- పులపత్తూరు గ్రామస్తులకు ఆర్వో నీటి సరఫరాను వైఎస్సార్‌సీపీ నాయకులు భీము జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటుచేశారన్నారు.

ఘన నివాళి



రంగసాయిపురం గ్రామంలో కేతు విశ్వనాథరెడ్డి అంతిమయాత్ర

కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, కథారచయిత కేతు విశ్వనాథరెడ్డికి ఎర్రగుంట్లమండలంలో బుధవారం అశ్రునయనాల మధ్య ఆప్తులు వీడ్కోలు పలికారు. కడప సింగపూర్ టౌన్ షిప్‌లో కేతు విశ్వనాథరెడ్డి భౌతిక కాయం వద్ద సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రంగసాయిపురంలో ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి పలువురు సాహితీవేత్తలు ఘన నివాళులర్పించారు. –కడప వైఎస్సార్‌సర్కిల్



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సంతాపం తెలియజేస్తున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

పక్కాగా పథకాలు అమలు చేయాలి

కడప రూరల్: మాతా శిశు సంరక్షణ పథకాలను పక్కాగా అమలు చేయాలని మెడికల్ అండ్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్, జోన్–4 రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం కడప నగరంలోని నకాష్, అక్కాయపల్లెలో గల డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. అక్కడ అమలవుతున్న ఆరోగ్య పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమాల్లో బాగంగా చిన్న పిల్లలకు ఇచ్చే టీకాలు, వ్యాధి నిరోధక టీకాలు, రక్త హీనత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ ఉబేదుల్లా, మునిరెడ్డి, సీహెచ్ఓ ప్రసాద్, మహబూబ్‌బాష పాల్గొన్నారు.



కడపలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

జీరో శాతానికి రక్తహీనత కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

అధికారులకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో అనీమిక్ కేసుల నమోదును జీరో శాతానికి తీసుకు రావాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ సాధికారతశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలు, వృద్ధులకు కూడా సేవలు అందించాలని సూచించారు. పౌష్టికాహారం, ప్రణాళిక ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మహిళలు, బాలికలకు రక్తహీనత సమస్యలు రాకుండా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు పర్యవేక్షించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా పరిధిలోని సచివాలయాలతో మ్యాపింగ్ చేయాలన్నారు. బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించేవారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. బాధ్యతగా పనిచేయకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాను మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ, ఐసీడీఎస్ పీడీ రాణి, సీడీపీఓలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బిందు సేద్యం.. సర్కారు సాయం

- చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు
- 55 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు
- జిల్లాలో 10,500 హెక్టార్లు లక్ష్యంగా అడుగులు
- ఆర్‌బీకేల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



లింగాల ప్రాంతంలో బొప్పాయికి ఏర్పాటు చేసిన డ్రిప్పు

కడప అగ్రికల్చర్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ సంస్కరణలు చేపడుతున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) ఏర్పాటు చేసి రైతులకు ఎరువులు, విత్తనాలు, సాగుపరికరాలు అందుబాటులో ఉంచడం వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి రైతు ప్రభుత్వమన్న ముద్ర వేసుకున్నారు. అలాగే రైతులకు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయడమే లక్ష్యంగా సూక్ష్మ సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పెట్టుబడి ఖర్చులను తగ్గిస్తూ సాగును లాభదాయకుంగా మార్చేందుకు రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలను సమకూర్చనుంది. రైతులకు నచ్చిన కంపెనీ ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

జిల్లాలో లక్ష్యం ఇలా..

డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి 2023–24 సంవత్సరానికి జిల్లాలోని 36 మండలాల పరిధిలో 10,500 హెకార్లను టార్గెట్‌గా ఇచ్చారు. రైతులకు నచ్చిన కంపెనీలతో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను పొందవచ్చు. ఇందుకు సంబంధించి 19 కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. డ్రిప్, స్ప్రింక్లర్లకు ఏర్పాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది.వీటి అవసరం ఉన్న రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేకు వెళ్లి అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లను కలిసి తమ వివరాలను నమోదు చేయించుకోవాలి.


సబ్సిడీ వివరాలు ఇలా...

సూక్ష్మసేద్య పథకంలో 5 ఎకరాలలోపు భూమి కలిగిన సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను ఇవ్వనున్నారు. డ్రిప్ యూనిట్ విలువలో 10 శాతం రైతు భరించాల్సి ఉంటుంది. అలాగే 55 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను మంజూరు చేయనున్నారు. మిగతా 45 శాతం రైతు భరించాల్సి ఉంటుంది.

- 5 నుంచి 10 ఎకరాలు మధ్య భూమి కలిగిన రైతు లకు 70 శాతం సబ్సిడీ డ్రిప్పు, 45 శాతం సబ్సిడితో స్ప్రింక్లర్ల పరికరాలను అందచేస్తారు. సబ్సిడీ పోను మిగతా సొమ్మును రైతులు భరించాల్సి ఉంటుంది.
- గతంలో సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు 7 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఉంటే వారు మళ్లీ పొందేందుకు అర్హులు
- భూమి కలిగిన ప్రతి రైతుకు(భార్య, భర్త) ఈ సబ్సిడీ పథకం వరిస్తుంది.
- మామిడి,సపోటా, చీని, జామ, అరటి, బొప్పాయి, విజిటబుల్, పూలతోటలు, పసుపు, ఉల్లి పంటలకు డ్రిప్, బుడ్డశనగ, వేరుశనగలకు స్ప్రింకర్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

నియోజకవర్గం	లక్ష్యం (హెక్టార్లలో)
పులివెందుల	5,715
జమ్మలమడుగు	1,995
కమలాపురం	1,125
బద్వేల్	620
మైదుకూరు	625
పొద్దుటూరు	195
కడప	10
రాజంపేట	215
మొత్తం	10,500

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం..



తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి 2023–24 సంవత్సరానికి ప్రభుత్వం జిల్లాకు 10,500 హెక్టార్లను టార్గెట్‌గా ఇచ్చింది. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. డ్రిప్పు, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలి. – యం. రవీంద్రనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీఎంఐపీ

సకాలంలో డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేయాలి

కడప అగ్రికల్చర్: రైతులకు సకాలంలో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేయాలని, వారి అభివృద్ధికి ఇంజినీర్లు కృషి చేయాలని గుంటూరు ఏపీఎంఐపీ ఓఎస్డీ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం కడపలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ప్రాజెక్టు కార్యాలయంలో పీడీ రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఏపీఎంఐపీ, ఎంఐ కంపెనీ ఇంజినీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలు అమర్చే విషయంలో ఎంఐ కంపెనీ ఇంజినీర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీరు క్షేత్ర సిబ్బందితో కలిసి పని చేస్తే తప్పులు జరగడానికి అవకాశం ఉండదని అన్నారు. ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి 9 వేల హెక్టార్లు లక్ష్యంగా ఇవ్వగా అందులో 9982 హెక్టార్లలో పూర్తి చేసి ఇప్పటి వరకు 9076 హెక్టార్లకు పరికరాలను రైతులకు అందించామన్నారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 10,500 హెక్టార్లు టార్గెట్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌శాఖలో బదిలీలకు మార్గదర్శకాలు విడుదల

కడప కార్పొరేషన్ : సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్)లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేస్తూ ఆ సంస్థ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఉద్యోగుల అభ్యర్థన, మ్యూచువల్, పరిపాలన పరమైన కారణాలతోనే ఈ ట్రాన్స్‌ఫర్లను చేయాలని, ఈనెల 22 నుంచి 31లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. పనిచేస్తున్న చోట ఐదేళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. పనిచేస్తున్న చోట రెండేళ్ల సర్వీసు పూర్తయిన వా రు బదిలీలకు, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు అర్హులవుతారు. 40 శాతానికి మించి వికలత్వం ఉన్నవారికి, మానసిక వికలాంగ పిల్లలు ఉన్న ఉద్యోగులకు, కేన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నవారికి, కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన వితంతువులకు, భార్య, భర్త ఇరువురూ ఉద్యోగులుగా ఉన్న వారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు.

మానసిక వేదనతో వ్యక్తి ఆత్మహత్య


జమాల్ బాషా మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని చిలకల బావి సమీపంలో కరీమూన్ కాంప్లెక్స్‌లో నివాసం వుంటున్న షేక్ జమాల్ బాషా(36) ఈనెల 23వ తేదీ రాత్రి మానసిక ఆవేదనతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని సోదరి షబానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. షేక్ జమాల్‌బాషా భార్య ఆరీఫున్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. జీవనాధారం కోసం ఆరీఫున్ ఏడాది కిందట కువైట్‌కు వెళ్లింది. ఏడాది కిందటే జమాల్ బాషా తండ్రి మదార్‌సాబ్ మృతి చెందాడు. తండ్రి మరణించినప్పటి నుంచి తీవ్ర మానసిక వేదనతో బాధపడే జమాల్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఎస్ఐ యు.వై. జయరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

వ్యక్తి దారుణ హత్య

కేవీపల్లె : ఆర్థిక గొడవతో వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లెలో చోటు చేసుకుంది. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలుకు చెందిన నరసింహులు (45) మూడేళ్లుగా జిల్లేళ్లమందలో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో దేవాండ్లపల్లెకు చెందిన రాజన్న ఇంటి పని చేయడానికి రూ. 3.70 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇంటి నిర్మాణం ప్రస్తుతం ప్లాస్టింగ్ దశ జరుగుతోంది. మంగళవారం రాత్రి తనకు డబ్బులు ఇవ్వాలని మేస్త్రీ నరసింహులు కోరాడు. అయితే పనిచేశాక ఇస్తానని రాజన్న చెప్పడంతో ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో రాజన్న కర్రతో కొట్టడంతో నరసింహులు మృతి చెందాడు.

జూదరుడా.. పద్ధతి మార్చుకో..

- స్వచ్ఛమైన తల్లి ప్రేమపైన విషం చిమ్మే మూర్ఖుడివి నువ్వు
- బీటెక్ రవి అసత్యపు ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : బీటెక్ రవి పులివెందులకు మూడు మాసాలకొకసారి వచ్చి పూలంగళ్ల దగ్గర, టీ అంగళ్ల దగ్గర వైఎస్ కుటుంబం గురించి అలా.. ఇలా అనుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ మాట్లాడటం సరి కాదని వైఎస్ఆర్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పులివెందుల, వేముల మండలాల కన్వీనర్లు బలరామిరెడ్డి, సాంబశివారెడ్డి, జెడ్పీటీసీలు రవికుమార్ రెడ్డి, బయపురెడ్డి, మండల పరిశీలకులు రామలింగా రెడ్డి, రామముని రెడ్డి, సింహాద్రిపురం మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి తదితరులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీటెక్ రవి చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. బీటెక్ రవి అంటే ఒక చీడ పురుగు అని, పులివెందుల అభివృద్ధిని, సంస్కృతిని స్వార్థ ప్రయోజనాల కోసం కించపరిచి మాట్లాడుతూ అభాసుపాలు చేసే మూర్ఖుడని, అతడొక జూదగాడని ప్రజలందరికీ తెలుసన్నారు. పులివెందుల మొత్తానికే బీటెక్ రవి అనే వ్యక్తి వల్ల చెడ్డ పేరు వస్తోందని ప్రజలు మాట్లాడుకుంటున్నారని.. ఆ విషయం బీటెక్ రవి మొదట అది గ్రహించాలని హితవు పలికారు. స్వచ్ఛమైన తల్లి ప్రేమపై కూడా విషం చిమ్మే మాటలు మాట్లాడడం బీటెక్ రవి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. నీలాగా కేసులకు భయపడి పారిపోయే వ్యక్తి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కాదు.. ఆయన మంచితనం, వ్యక్తిత్వం గురించి జిల్లా ప్రజలకు బాగా తెలుసు.. అవినాష్‌రెడ్డి ఏ తప్పు చేయలేదు కాబట్టే ఏడు సార్లు సీబీఐ విచారణకు హాజరయ్యారన్నారు. తల్లి అనారోగ్యం కారణంగా విచారణకు హాజరు కాలేనని ఎంపీ లేఖ ద్వారా సీబీఐ అధికారులకు తెలిపారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నుతున్నా.. అదరక.. బెదరక .. సీబీఐ విచారణకు ఎంపీ సహకరిస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు కుట్రపూరిత ఆలోచనలు మానుకోవాలని.. ఎల్లో మీడియా అత్యుత్సాహం మానుకోవాలని హితవు పలికారు. రెండు వేల నోట్లు.. వైఎస్ జగన్ అక్రమాస్తులు అంటూ.. పొంతన లేకుండా మాట్లాడడం చూస్తే బీటెక్ రవికి మతిభ్రమించినట్లుందన్నారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకుని ప్రజా సేవ చేయకుండా, అక్రమ సంపాదనను స్విట్జర్లాండ్‌లో దాచుకున్న పార్టీ టీడీపీనే అని ధ్వజమెత్తారు. టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని వారు పేర్కొన్నారు.

కౌన్సిలర్లు కోడి రమణ, కిశోర్, మహేశ్వరరెడ్డి, రాజశేఖరరెడ్డి, డేనియల్, ఖాదర్, రవి శంకర్, కో.ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, సర్పంచ్‌ల సంఘం తాలుకా అధ్యక్షుడు కుమారకాల్వ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు మహేశ్వరరెడ్డి, విద్యానందరెడ్డి, సర్పంచ్‌లు, జేసీఎస్ మండల కన్వీనర్లు నాగేంద్రారెడ్డి, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, వర్రా రవీంద్ర, రజినికాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు కూడా బీటెక్ రవి తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

రూ. 2 వేల నోట్ల మార్పిడిపై స్పష్టత ఇవ్వాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రూ. 2 వేల నోట్ల మార్పిడిపై రిజర్వుబ్యాంకు రోజుకొక ప్రకటన చేయడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. కడప ఏడురోడ్ల కూడలిలోగల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో బుధవారం ఆయన చీఫ్ మేనేజర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రూ. 2 వేల నోట్లను మార్చుకునేందుకు సెప్టెంబరు మాసం వరకు వెసులుబాటు కల్పిస్తూ షరతులను సరళతరం చేస్తూ తీసుకున్న నిర్ణయం వెనుక బీజేపీ ఆర్థిక ప్రయోజనాలు, సంపన్నుల బ్లాక్ మనీ మార్పిడికి అవకాశం ఇస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. కొందరు బ్యాంకు అధికారులను విచారించగా..రూ. 50 వేలులోపు ఆధార్ చూపితే సరిపోతుందని, రూ.50 వేలు పైబడిన వారికి పాన్‌కార్డు తప్పనిసరిగా చూపించాలని చెబుతుండగా, మరికొందరు ఎలాంటి ఆధారాలు చూపించకుండా ఎంత నగదు అయినా మార్చుకోవచ్చని తెలియజేస్తున్నారన్నారు. ఇందులో ఆర్బీఐ ఆదేశాలు స్పష్టంగా లేవని, ఇప్పటికైనా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, వెంకటశివ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం


వివరాలను తెలుపుతున్న సీఐ చలపతి

మైదుకూరు : రెండు వారాల కిందట మైదుకూరులోని బద్వేలు రోడ్డులో ఒకే రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీకి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్టు అర్బన్ సీఐ బీవీ చలపతి బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానిక బద్వేలు రోడ్డులో రెండు మెడికల్ షాపులు, ఒక బేకరి, ఒక సెల్ పాయింట్‌లో సెట్టర్ల తాళాలు పగులగొట్టి రూ.50 వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లు చోరీ చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో చోరీకి పాల్పడిన గొల్ల కుమార్ అలియాస్ దువ్వల కుమార్ అనే యువకున్ని బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్టు సీఐ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా నారాయణ నెల్లూరుకు చెందిన ఈ యువకుడు ప్రస్తుతం నెల్లూరులోని కొత్తూరు రోడ్డు చర్చి వీధిలో ఉంటున్నాడని, దొంగతనాలే వృత్తిగా జీవిస్తున్నాడని తెలిపారు. రాజంపేట సబ్ జైలు నుంచి ఈనెల 5న ఓ చోరీ కేసులో బెయిల్‌పై విడుదలై, 10వ తేదీన బద్వేలులో, 12వ తేదీ రాత్రి మైదుకూరులో దొంగతనానికి పాల్పడ్డాడని వివరించారు. ఇతనిపై విజయవాడలో 5, పశ్చిమ గోదావరిలో 4, నెల్లూరులో 22, తూర్పు గోదావరిలో 6, విశాఖలో 5, అన్నమయ్యలో 3, హైదరాబాద్‌లో 2 కేసులు నమోదు అయినట్టు తెలిపారు. మైదుకూరు, బద్వేలులో చేసిన చోరీ కేసుల్లో ఇతన్ని సీసీ కెమెరాల్లోని పుటేజీల ఆధారంగా గుర్తించి పట్టుకున్నట్టు చెప్పారు. అతని వద్ద నుంచి రూ.4వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

టైర్ల దొంగ అరెస్ట్


టైర్లను పరిశీలిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : టైర్ల దుకాణంలో పనిచేసిన ఓవ్యక్తి పని మానేశాక, డూప్లికేట్ కీస్‌తో సుమారు రూ.6.50లక్షల విలువచేసే ఎం.ఆర్.ఎఫ్ టైర్లను దొంగిలించి పోలీసులకు పట్టుబడిన సంఘటన బుధవారం పట్టణంలో వెలుగుచూసింది. బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప చోరీ వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయిజిల్లా తనకల్లు మండలం కొక్కంటిక్రాస్‌కు చెందిన ఆవుల కృష్ణమూర్తి(33) జీవనోపాధికి మదనపల్లెకు వచ్చి నాగిరెడ్డివీధిలో నివాసం ఉంటూ పుంగనూరురోడ్డులోని గరుడటైర్స్ జోన్(ఎంఆర్ఎఫ్ టైర్ల దుకాణం)లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. దుకాణంలో మూడేళ్లుగా పనిచేస్తూ యజమానికి నమ్మకంగా ఉండేవాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వ్యక్తిగత కారణాలతో పనిమానేస్తున్నట్లు యజమానికి తెలిపాడు. విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో టైర్లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. అయితే పనిచేస్తున్న సమయంలో దుకాణం తాళాలను డూప్లికేట్ చేయించుకుని తన వద్ద ఉంచుకున్నాడు. గరుడ టైర్స్ జోన్ ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటుంది. తర్వాత దుకాణాన్ని మూసివేసి యజమాని ఇంటికి వెళ్లిపోతారు. ఈ విషయం తెలిసిన కృష్ణమూర్తి రాత్రి 7 గంటల తర్వాత డూప్లికేట్ కీస్‌తో దుకాణాన్ని తెరచి ఇతరులకు అనుమానం రాకుండా టైర్లను తెలివిగా చోరీ చేసి ఆటోలో బయటకు తరలించేవాడు. ఇలా పలుమార్లు తరలించిన టైర్లను బయటివ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ విధంగా పలుదఫాలుగా రూ.6.50లక్షల విలువ చేసే 383 టైర్లను చోరీ చేశాడు. ఇటీవల షాపు యజమాని దీపక్ అమ్మకాల్లో తేడాను గమనించాడు. ఈనెల 18వ తేదీన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ మహబూబ్‌బాషా, పోలీసులు దర్యాప్తు చేయగా కృష్ణమూర్తి టైర్లు చోరీ చేసినట్లు నిర్ధారణయింది. నిందితుడిని అరెస్ట్ చేశారు.

డీసీసీ బ్యాంకులో తక్కువ వడ్డీకే రుణాలు

ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకులో తక్కువ వడ్డీకే లబ్ధిదారులకు రుణాలను అందజేస్తున్నామని డీసీసీ బ్యాంకు, ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ రాణి అన్నారు. బుధవారం కడపలోని డీసీసీ బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సంతవ్సరాలుగా నష్టాలలో ఉన్న కడప డీసీసీ బ్యాంకును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆప్‌కాబ్ సహకారంతో లాభాలబాటలోకి తీసుకుని వచ్చామని, అందుకోసం పదవి చేపట్టిన రోజు నుంచి నిరంతర కృషి చేస్తూనే ఉన్నామన్నారు. ఇప్పటి నుంచి సొసైటీలను లాభాలబాటలోకి తీసుకుని రావడమే ధ్యేయంగా పని చేస్తామని, అందుకు సొసైటీ అధ్యక్షుల సహకారం కావాలన్నారు. ఇప్పటికే చాలా సొసైటీలలో కళ్యాణ మండపాలు నిర్మించడానికి, పెట్రోల్‌బంక్‌లు స్థాపించడానికి, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడానికి నాబార్డు నుంచి 1 శాతం వడ్డీతో రుణాలు ఇప్పిస్తామన్నారు. బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడానికి కడప డీసీసీ బ్యాంకు కృషి చేస్తుందన్నారు. అలాగే ఆఫీసు కోసం స్థలం కొనుక్కోడానికి, భవన నిర్మాణానికి రూ. 25 లక్షల వరకు రుణాలు ఇస్తుందన్నారు. ఈ సౌకర్యాలను వినియోగించుకుని సొసైటీలను అభివృద్ధిపథంలో నడిపించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ డ్వాక్రా రుణాలను అత్యంత తక్కువ వడ్డీకి డీసీసీ బ్యాంకు మాత్రమే ఇస్తుందన్నారు. అలాగే ఏపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కస్టమ్ హైరింగ్ సెంటర్స్, అమూల్ పాల వెల్లువ, జగనన్న తోడు తదితర పథకాలను కడప డీసీసీ బ్యాంకు విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. రూ.2100 కోట్లు రుణాలు రైతులకు అందచేశామన్నారు. ఈ సమావేశంలో పేటీఎం వారి మొట్టమొదటి పాస్ మెషిన్‌ను బ్యాంకు కరెంట్ అకౌంట్ ఖాతాదారు అయిన బహార్ కేఫ్ రెస్టారెంట్ వారికి ఇవ్వడం ద్వారా కడప డీసీసీ బ్యాంకులో పాస్ మెషిన్‌లకు ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బాకీ డబ్బుల విషయమై ఇరువర్గాల ఘర్షణ


మీడియాతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం నగరిగుట్టలో మంగళవారం మధ్యాహ్నం బాకీ డబ్బుల విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని అర్బన్ సీఐ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హుస్సేన్, ఏఎస్ఐ స్వామిలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం రత్నాకర్‌కు ఇచ్చిన రూ.20వేల బాకీ డబ్బులను అడిగేందుకు రత్నాకర్ ఇంటికి నగరిగుట్టకు చెందిన మోటా వినోద్, విజయ్‌లు వెళ్లారని.. ఇదే క్రమంలో మా ఇంటి వద్దకు వచ్చి డబ్బులు అడుగుతావా అంటూ.. మాట మాట పెరిగి వినోద్, విజయ్‌కుమార్‌లతో రత్నాకర్, అతని బంధువు మణి ఘర్షణకు దిగారన్నారు. ఈ ఘర్షణలో వినోద్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. వినోద్‌పై దాడి చేయడంతో అతని బంధువులు రత్నాకర్, అతని బంధువుల ఇళ్లపై దాడి చేసి తలుపులు, వస్తువులను పగులగొట్టారు. ఇంటి బయట ఉన్న రెండు బైకులకు నిప్పు పెట్టి మరో బైకులను రాళ్లతో ధ్వంసం చేశారన్నారు. ఈ ఘర్షణలో రత్నాకర్ బంధువు మణికి కూడా గాయాలయ్యాయన్నారు. ఈ విషయాన్ని కొన్ని మీడియాలు అసత్యాలను ప్రసారం చేశారన్నారు. అసత్యాలను ప్రసారం చేయడంవల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగి.. అవాంఛనీయ సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. అవాస్తవాలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వినియోగదారులు సంతృప్తి చెందేలా విద్యుత్ సేవలు

- రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ అందించాలి
- ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించాలి
- ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : వినియోగదారులు సంతృప్తి చెందేలా విద్యుత్ సేవలు అందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్ రమణ అన్నారు. బుధవారం సాయంత్రం విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు దరఖాస్తు చేసుకున్న వెంటనే సర్వీసులు విడుదల చేయాలన్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు సిబ్బంది సేఫ్టీ బెల్టు, ఇండక్షన్ టెస్టర్, రబ్బరు తొడుగులు, ఎర్త్ రాడ్ వంటి సేఫ్టీ పరికరాలు తప్పకవాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు ఐదు నిముషాల పనే కదా అని తాత్సారం చేసి భద్రతా పరికరాలు వాడకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. క్షేత్రస్థాయి అధికారులు విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉంటూ ప్రమాద రహిత జిల్లాగా మార్చాలని సూచించారు. జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు బిగించాలన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. కడప డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని, వాటిని వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల పొలాలకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయలన్నారు. విద్యుత్ మరమ్మతులు, అంతరాయాలను వినియోగదారులకు ముందస్తుగా తెలియజేసేందుకు ఉర్జా మిత్ర యాప్‌లో అంతరాయాలను నమోదు చేయాలని, పత్రికా ప్రకటనలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహప్రసాద్, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. మదనపల్లె బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లెకు చెందిన సోమశేఖర్, అతనిభార్య లక్ష్మి కుమారుడు కిరణ్, కుమార్తె లోహితతో కలిసి పట్టణంలోని ఓ వివాహానికి మంగళవారం రాత్రి హాజరయ్యారు. ద్విచక్రవాహనంలో తిరిగి వెళుతుండగా నిమ్మనపల్లె కూడలి వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితితో వ్యక్తి మృతి


భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య సుకన్య

రైల్వేకోడూరు రూరల్ : రైల్వేకోడూరు మండలంలోని దేశెట్టిపల్లె గ్రామ సమీపంలో ఓ మామిడి తోటలో మర్రి కృష్ణయ్య (47) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతునికి భార్య సుకన్య, నలుగురు సంతానం ఉన్నారు. మృతుని భార్య వివరాల మేరకు... దేశెట్టిపల్లె గ్రామానికి చెందిన కృష్ణయ్య మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటినా భర్త ఇంటికి రాకపోవడంతో భార్య ఆయన సెల్‌కు ఫోన్ చేసింది. అలా చాలా సార్లు చేసినా ఎలాంటి స్పందన రాలేదు. బుధవారం తెల్లవారే సరికి గ్రామం పక్కనే ఉన్న మామిడి తోటలో శవమై ఉన్నాడని తెలుసుకున్న ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. తండ్రి మృతి చెందడంతో వారి పిల్లలు కూడా రోదిస్తున్నారు. కృష్ణయ్య మామిడి కాయలకు వెళితే ఆ తోట యజమానులు ఏమైనా కొట్టి చంపేశారా, లేక ఏవైనా కారణాలతో ఇలా చేశారా అని మృతుని భార్య, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని చేతికి గాయం కాగా చెవి నుంచి రక్తం కారినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వేటగాళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో అడవి జంతువుల వేటగాళ్లు

సుండుపల్లె (రాయచోటిటౌన్) : అడవి జంతువులను వేటాడటానికి వెళ్లిన ఏడుగురు వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచురాజు తెలిపారు. మంగళవారం రాత్రి తమ సిబ్బందిలోని ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డి, లింగాధర్ ఆయన టీం సభ్యులతో పాటు సానిపాయి టాస్క్‌ఫోర్స్ ఎర్రచందనం స్మగ్లర్లను వేటాడటానికి వెళ్లారని చెప్పారు. అయితే పింఛా సెక్షన్‌లోని జిల్లేడమంద బీట్‌లోని దయ్యాలపెంటలో కూంబింగ్ నిర్వహిస్తుండగా రాతిదొన ప్రదేశంలో కొందరు వ్యక్తులు ఉండటాన్ని గమనించి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు అడవి జంతువులను వేటాడటానికి వచ్చినట్లు తెలిసిందన్నారు. పట్టుబడిన వారిలో రాయవరం గ్రామం పాముల సాయి, ముడుంపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ సురేంద్ర,పాగ మురళి, బోడక సురేంద్ర, పసుపులేని భాస్కర్, కడప పట్టణానికి చెందిన చిప్పల సాయికుమార్, షేక్ హుస్సేన్ ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి ఒక నాటు తుపాకీ, నల్లమందు, రవ్వల గుండ్లు, మందు సంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అప్పటికే ఈ తుపాకీతో రెండు రౌండ్లు దుప్పిని కాల్చారని అయితే అది తప్పించుకొని పారిపోయినట్లు వారు చెప్పినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ప్రభుత్వ విధానాల అమలుకు చర్యలు

కడప ఆర్‌వీ అండ్ ఈఓగా బాధ్యతలు చేపట్టిన షేక్ మాసుంబాష



కడప అర్బన్ : ప్రభుత్వ నిబంధనల మేరకు విధానాలు అమలు జరిగేలా చూస్తామని, ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అదనపు ఎస్పీ షేక్ మాసుంబాష అన్నారు. కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా, ఇటీవల అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది కడపకు బదిలీపై వచ్చిన షేక్ మాసుంబాష బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజాపంపిణీ వ్యవస్థతో పాటు, నిత్యావసర వస్తువుల కల్తీ నిరోధం, రైతులకు ఎరువుల, మందుల పంపిణీలో అవకతవకలు, హాస్టళ్లలో భోజన వసతులు, సౌకర్యాలతో పాటు, తమ శాఖ పరిధిలోని ప్రతి అంశంపై క్షుణ్ణంగా పరిశీలించడం, ఎప్పటికప్పుడు తమకు వచ్చిన ఫిర్యాదులు, సమాచారం మేరకు తనిఖీలు, పరిశీలనలు నిర్వహిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ పరిధిలోని వివిధ శాఖల అధికారుల సహకారంతో ప్రజలకు మేలు చేకూర్చేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

షేక్ మాసుంబాష ప్రస్థానం..

షేక్ మాసుంబాష 2012 బ్యాచ్‌కు చెందిన గ్రూప్–1 అధికారి. కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన ఆయన 2012లో డీఎస్పీగా ఎంపికై ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని తెలంగాణాలో పంజాగుట్ట ట్రాఫిక్ ఏసిపిగా విధులను నిర్వహించారు. ఆ తరువాత ప్రకాశం జిల్లా మార్కాపురంలో డీఎస్పీగా పని చేశారు. అక్కడి నుంచి కడప డీఎస్పీగా 2017 జూలై నుంచి 2019 జూలై వరకు విధులను నిర్వహించారు. ఇక్కడి నుంచి అమలాపురం, తరువాత మచిలీపట్నంలో డీఎస్పీగా పనిచేశారు. తరువాత వెయిటింగ్‌లో వుండగా అదనపు ఎస్పీగా పదోన్నతి లభించింది. కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా, అదనపు ఎస్పీ హోదాలో బదిలీ అయి, విధుల్లో చేరారు.

నేటి నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

- 29 నుంచి ర్యాంకులవారీగా ధ్రువ పత్రాల పరిశీలన
- పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్ జ్యోతి



కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పాస్ అయి పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ కోసం గురువారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ సిహెచ్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి ప్రాసెసింగ్ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. ప్రాసెసింగ్ రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 750, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250 చెల్లించాలని తెలిపారు. 25వ తేదీ నుంచి ప్రాసెసింగ్ రుసుం చెల్లించుటకు ఆన్‌లైన్ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన తరువాత సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కోసం తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు 29వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్ల జిరాక్స్‌తో రావాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తమతో పాటు ప్రాసెసింగ్ రుసుం రసీదు, పాలిసెట్ ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సి మార్కుల మెమో, టీసీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కమ్ సర్టిఫికెట్ తీసుకుని రావాలని సూచించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయిన తర్వాత మొబైల్ నెంబర్‌కు లాగిన్ ఐడి వస్తుందని తెలిపారు. రిజిస్టర్ మొబైల్ నెంబర్ తో జూన్ 1వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన తర్వాత మాత్రమే హెల్ప్‌లైన్ సెంటర్‌కు షెడ్యూల్ ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావలసిందిగా తెలిపారు. పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్లను కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, పొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు మాత్రమే రావాలన్నారు. స్కౌట్, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, పీహెచ్ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలకు జూన్ 2వ తేదీ వెళ్లాలని తెలిపారు.